# బహుమతి

యం. ఉమామహేశ్వరరావు

వాలుకుర్చీలో కూర్చుని విలాసంగా చుట్ట కాలుస్తున్నాడు ఆ ఊరి పెద్ద వెంకటరాయుడు.

కాలుతున్న ఆ లంక పొగాకు చుట్టనుంచి తెల్లగా, మబ్బులా వస్తున్న పొగ చుట్టూ మూగిన జనాల నాసికాపుటాల్లోకి ఘాటుగా చొరబడుతోంది.

వెంకటరాయుడి ఆర్డరు ఏదైనా సరే, అది వెంటనే అమలుచేయడానికి సిద్ధంగా ఉన్నాడు వెంకన్న.

ఆ ఇంటి తలుపు దగ్గర నుంచుని చూస్తోంది వెంకటరాయుడి భార్య.

రాత్రి ఎనిమిది గంట లయింది. వీధి లైట్లు ఎర్రటి కాంతిని చిమ్ముతూ పరిసరాలను ప్రకాశవంతం చేస్తున్నాయి.

గుబురు మీసాలను మాటి మాటికీ సవరించుకుంటూ తన ముందున్న ఆ 'కళాకారుల'నూ, వారి ప్రదర్శననూ పరిశీలనగా గమనిస్తున్నాడు వెంకటరాయుడు. అతని పక్కనే మరో కుర్చీలో కూర్చుని ఉన్నాడు ఆ ఊరి చిన్న దొర జగ్గరాజు. జగ్గరాజుకు పక్కనే తనూ ఓ కుర్చీలో కూర్చుని, ప్రదర్శనను తిలకిస్తున్నాడు రామమూర్తి. అతను కూడా ఊళ్ళో పెద్దగానే పేరు పొందాడు.

రాత్రి భోజనాలు అయినాక ఊళ్ళోని జనం బజారులోకి వస్తారు. కాసేపు అవీ ఇవీ ముచ్చటించుకున్నాక ఎవ రిళ్ళకు వాళ్ళు పోతుంటారు. వెంకటరాయుడి ఇంటికి ఆనుకునే ఉన్న ఎలిమెంటరీ పాఠశాల ఆవరణ అది. ఆ ఆవరణ చుట్టూ జనం కూర్చుని ఉన్నారు. ఆ జనం మధ్యలో ఆ కళాకారు లున్నారు. వెంకటరాయుడికీ, జగ్గరాజుకీ, రామమూర్తికీ ప్రదర్శన కనిపించేలా సర్దుకు కూర్చున్నారు జనం.

ఎక్కడినుంచో వచ్చిన ఆ కళాకారులు ఇస్తున్న ప్రదర్శన ఓ చారిత్రాత్మక వీధి నాటకం.

దాని పేరు 'సారంగధర.'

** ** **


ముసలి రాజుగారి రెండో భార్య చిత్రాంగి.

వయసులో ఉం దామె. మొదటి భార్య కుమారుడు సారంగధరుడు. సుగుణవంతుడు. అందంలో మన్మథుడు. తన యౌవనమంత అడవిగాచిన వెన్నెలలా మారిపోతూంటే, ఆ మన్మథ బాధకు తాళలేని చిత్రాంగి, కొడుకు వంటి సారంగధరునిమీద మనసు పడుతుంది. సారంగధరుని రూపం మనసునిండా ఆవహించగానే ఆ ప్రేమ మైకంతో, కామంతో సారంగధరుడి వెంటబడుతుంది. ఆమె తనకు పినతల్లి వంటిదన్న సారంగధరుడి మాటల్ని తోసిపారేస్తుంది. సారంగధరుని మగతనాన్ని సవాలు చేస్తుంది.

చిత్రాంగి వేషం వేసిన ఆ కళాకారిణి అభినయం, హొయలు, లయలు వెంకటరాయుడి గుండెలో చిన్న కదలిక కలిగించాయి. అయినా తమాయించుకుంటూ కూర్చున్నాడు వెంకటరాయుడు.

జగ్గరాజు ఉలుకూ... పలుకూ మరిచిపోయాడు.

రామమూర్తి రక్తంలో వేగం పెరిగిపోయింది.



సారంగధరుడి వేషం వేసిన కళాకారుడి గొంతులో వినిపిస్తున్న లాలిత్యం, కమ్మదనం వెంకటరాయుడినీ, జనాన్నీ మైమరింపచేశాయి.

"సారంగో... సారంగో...

నాసామి సారంగో..." అంటూ చిత్రాంగి కురిపించే 'వలపు', కాదంటూ విముఖత చూపిస్తున్న ఘట్టం రసవత్తరంగా ఉంది. గొప్పగా ఉంది.

"ఆ రోజుల్లో చిత్రాంగి ఎలాగుండేదో మనకు తెలీదుగానిండి, ఇవ్వు డీ చిత్రాంగి వేషం కట్టిన ఆడమనిషిని చూస్తుంటే గుండెలు పొంగిపోతున్నాయి!" జగ్గరాజు చెవుల్లో గుసగుసగా అన్నాడు రామమూర్తి.

వెంకటరాయుడి లంక పొగాకు చుట్ట పూర్తవజొచ్చింది.

సనాతనమైన, సునిశితమైన భావాలను ప్రజల్లో ప్రవేశపెట్టి న్యాయం, ధర్మం, సత్యం వంటి వాటిపట్ల ప్రజల్లో గౌరవం ఇనుమడింపచేస్తూ, వావివరసల విలువలను ప్రజలకు సాటిచెప్పే వీధి నాటకం సారంగధర.

పగటి వేషాలతో పురాణాలూ, జముకుల కథలూ, తోలుబొమ్మ లాటలూ, చిడతల భాగవతాలూ, చరిత్ర నించిన వీధి నాటకాలూ వల్లె ప్రజల్లో చోటు చేసుకున్నంతగా పట్టణ వాసుల్లో చొరబడలేవు.

రాజుగారి భార్యా ప్రియత్వం, చిత్రాంగి బుసలు, ధర్మానికి కట్టుబడి శిక్ష పొందటానికి సిద్ధపడిన సారంగధరుడూ.

వీరి పాత్రలతో జనంలో ఆ నాటకం పట్ల ఆసక్తి పెరిగి, అభిమానం హద్దులు మీరింది.

సాధారణంగా వీధి నాటకాల కళాకారులకు ఒక ఊరంటూ, ఒక ప్రాంతమంటూ ఉండదు.

కళలను ప్రేమించే మనుషుల మధ్య, సాంప్రదాయాన్ని నిలుపుకునే ప్రాచీనకళ 'వీధి భాగోతం.'

రామాయణం, భారతం, భాగవతం వంటి వాటిని కూడా వీధి నాటకాలుగా వేసే కళాకారు లున్నారు.

సారంగధర ప్రదర్శన చివరి సన్నివేశం బరువైన అభినయాలతో నిండింది. పాట - రాగం - నృత్యం - అభినయం, వేషాలకు సరిపోయిన కళాకారులు, వారికి సరిపోయిన దుస్తులు, సొంపైన స్వరాలు... ఆ ప్రదర్శన ఎంతో రక్తికట్టింది.

రాగం తెలియనివాడు రారాజైనా ఆ కళను ప్రేమించలేడు.

ప్రదర్శన పూర్తయింది.

జనం చప్పట్ల మధ్య, ఈలల మధ్య అందరికీ వందనాలు అర్పించారు ఆ కళాకారులు. ఆ వెంటనే మంగళహారతి.

చిత్రాంగి వేషం వేసిన కళాకారిణి పళ్ళెన్ని పట్టుకుని ముందుగా రామమూర్తి వద్దకు వచ్చింది.

మరో వేపునుంచి సారంగధరుడి పాత్రధారి పళ్ళెంతో జనం వద్దకు కదిలాడు.

వెంకటరాయుడి దృష్టంతా సారంగధరుడిపైనే ఉంది. అతని అభినయం చాలా నచ్చింది రాయుడికి.

రామమూర్తికీ, జగ్గరాజుకీ చిత్రాంగి పాత్రధారిణి నచ్చింది. ఆవిడ ఉలుకూ కులుకూ బాగా నచ్చాయి.

జేబులో చెయ్యి పెట్టి చేతికి అందినంత సొమ్ము బయటకు తీశాడు రామమూర్తి.

"రామమూర్తిగారి బహుమతి అర్ధనూట పదార్లు!"

చప్పట్లు మోగాయి.

జగ్గరాజు కళ్ళు చిట్లించి తనూ జేబులో చెయ్యి పెట్టాడు. జగ్గరాజు దగ్గరగానే నుంచున్న అనుచరుడు దగ్గాడు.

"బాబుగోరూ! రామమూర్తిగోరి కంటే మన బహుమతి ఎక్కువే వడాల! నేకపోతే మన పరువు పోతది!"

త లూపాడు జగ్గరాజు. జేబులోంచి డబ్బు తీశాడు.

"జగ్గరాజుగోరి బహుమతి నూట పదార్లు!"

మళ్ళా చప్పట్లు మోగాయి.

కళాకారుల ముఖాల్లో ఆనందోత్సాహాలు.

"అదిగో వినరా! ఆ చప్పట్లు! అవేరా ఆకలితో ఎండిన ప్రేగుల్లో అమృతం చిలికించేవి. దరిద్రంతో నిండిన కళాకారుల బ్రతుకుల్లో ఆనందాన్ని నింపేవి. ఆ చప్పట్లు వింటేనే చాలు గుండెలు పులకిస్తాయి. ఆ చప్పట్లు వింటేనే చాలు కన్నులు చెమరుస్తాయి."


'కీర్తిశేషులు' నాటకంలో 'మురారి' పాత్ర పలికిన మాటల్లో ఎంతో వ్యథ ఉంది. ఎంతో బాధ తెలుస్తుంది. పాషాణ హృదయంతో ఉన్న మనిషినైనా ఇట్టే కదిల్చి ఊపుతాయి.

"బ్రతికున్నంత కాలం ఈ ఊరినీ, ఈ ఆదరాన్నీ గుర్తుపెట్టుకుంటాం బాబూ!"

చేతులెత్తి నమస్కరించారు కళాకారులు.

ఇదంతా చూస్తూ నిర్లిప్తంగా ఉండిపోయిన వెంకటరాయుడిని సమీపించాడు వెంకన్న.

"పెద్ద బాబుగోరూ! ఈ ఊరు మనది. ఈ ఊళ్ళోని నాటకాలాడే ప్రతి మనిషికీ మన



చిత్రం-శ్రీకాంత్ ఆనంద్

'బహుమతి'ని అందుకున్నాక మరొక్క మనిషెవర్నీ గుర్తుపెట్టుకోకూడదు. తవ్వరగా తీయండీ! బాగా నదివించండి బహుమతి. రామ్మూర్తిగోరూ, జగ్గరాజుగోరూ అదిరిపోయేలా నదివించండి. తియ్యండి బాబూ, జేబులోంచి. మన బహుమతితో ఆల్లంతా మురిసిపోవాల! జనాలు మీ పేరు సెప్పుకుంటూ ఇళ్ళకెళ్ళి నిద్దరోవాల! ఇది మన 'పరువు'మీద కొచ్చిపడ్డ యవ్వారం! తియ్యండి బాబూ జేబులోంచి."

వెంకటరాయుడు ఏం బహుమతి ఇస్తాడోనని అంత ఎదురుచూస్తున్నారు.

వెంకటరాయుడి పెదాల్లో 'తడి' ఆరిపోతున్న దా సమయంలో.

పేరుకూ పెద్దవాడే. పెత్తందారీకీ పెద్దవాడే. కానీ, ఆ సమయంలో అతని దగ్గర డబ్బు లేదు. పోనీ ఇంట్లోంచి తెద్దామన్నా ఇంట్లోనూ లేదు.

వెధవ సమస్య - పరువూ ప్రతిష్ఠల సమస్య. పదిమందిలోనూ నిలబెట్టిన సమస్య. తన ఉనికికే సవాలుగా నిలిచిన సమస్య.

ఇక ఆలోచించలేకపోయాడు వెంకటరాయుడు. అతని తలలో ఏదో ఆలోచన మెరిసిం దొక్కమారుగా. అటూ ఇటూ చూశాడు. తన ఇంటి ముందు నుంచుని ఇదంతా నిశ్శబ్దంగా గమనిస్తోం దతని భార్య. దగ్గరగా రమ్మని పిలిచాడు.

ఆవిడ వచ్చింది. నెమ్మదిగా ఆమెతో ఏదో చెప్పాడు. ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టిం దామె. ఏదో చెప్పబోయింది తిరిగి భర్తతో.

"ఊ... ఇంకేం చెప్పవద్దు! నేను చెప్పినట్లు చెయ్! త్వరగా!" వెంకటరాయుడి హుంకరింపుతో గబగబా లోపలకు కదిలింది.

ఏదో పెద్ద బహుమతే చదివిస్తారని అంత కళ్ళు ఒప్పగించి మరీ చూడసాగారు.

వెంకడు గర్వంగా ఓసారి అందరికేసీ చూశాడు. ఇంట్లోకి వెళ్ళిన వెంకటరాయుడి భార్య తిరిగి వచ్చింది. ఆమె గుప్పెట్లో 'ఏదో' ఉంది. తిన్నగా వచ్చి వెంకటరాయుడి చేతుల్లో ఉంచింది.

కళ కళ కోసమే.

కాదు కాదు కాసుకోసం.

కాదు. కళ కళ కోసమే. కళను అన్యాయం చెయ్యొద్దు.

కళాకారుణ్ణి అవమానించవద్దు.

వెంకటరాయుడిలో అంతవరకూ రగిలిన బాధ ఆ వస్తువు చేతుల్లోకి రాగానే మాయమైంది.

తన చేతుల్లోని ఆ వస్తువును పైకి తీసి, అందరికీ ఒక్కసారిగా చూపించాడు వెంకటరాయుడు.

ఆ వస్తువు ఓ బంగారు పతకం.

దిక్కులు అదిరిపోయేలా చప్పట్లు మోగాయి. జగ్గరాజు గుండె గతుక్కుమంది. రామమూర్తి నూపులు ఆగిపోయాయి.

వెంకన్న గర్వంగా మీసం మెలితిప్పాడు.

"రాయుడిగోరికీ జై" పెద్దనాయుడిగోరికీ జై!"

జనం ఆనందంతో జైజైలు కొట్టారు. ఆ అరుపుల మధ్య, ఆ నినాదాల మధ్య వెంకటరాయుడు చేతిలోని ఆ బంగారు పతకం సారంగధర పాత్రదారి దుస్తులకు తగిలించాడు.

"కళలు వర్ధిల్లాలి! కళాకారుల్ని గౌరవించే వెంకటరాయుడుగారు వర్ధిల్లాలి!"

ఆ కళాకారులంత ఒక్కుమ్మడిగా, ముక్తస్వరంతో వెంకటరాయుడిని పొగిడి అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

రామమూర్తిగాని, జగ్గరాజుగాని వెంకటరాయుడితో ఒక్క మాట అనలేదు. కనీసం మెచ్చుకోనూ లేదు. వెంకటరాయుడి దాతృత్వం ముందు తమ దాతృత్వం నిలబడలేదన్న బాధతో మౌనంగా అక్కడి నుంచి లేచి ఇళ్ళకు వెళ్ళిపోయారు.

జనం అంత నాటకం గురించీ, వెంకటరాయుడి బహుమతి గురించీ చెప్పుకుంటూ కదిలారు.

అంత వెళ్ళిపోయాక చుట్టూ చూశాడు వెంకటరాయుడు. అతని గుబురు మీసాల మాటునుంచి చిన్నగా కదిలిం దో నిట్టూర్పు. అతని పక్కనే భార్య ఏటో చూస్తూ.

"చాలా కృతజ్ఞుణ్ణి. పోతుం దనుకున్న మన పరువు నిలబెట్టావు. జనం మధ్యలో నవ్వులపాలయ్యే పరిస్థితినుంచి రక్షించావు." ఇంట్లోకి కదిలివస్తూ అన్నాడు వెంకటరాయుడు.

ఆమె ముఖంలో సంతోషం లేదు. దిగాలుగా, బాధగా పక్క గదివేపు చూసింది.

ఆ గదిలో వెంకటరాయుడి మనుమడు, పన్నెండేళ్ళవాడు అంతవరకూ గుండె లవిసేలా ఏడ్చి, ఏడ్చి మంచంమీద నిద్రపోతూ కనిపించాడు వెంకటరాయుడికి.

దగ్గరగా వెళ్ళలేక, తలుపు దగ్గరే ఆగిపోయాడు. అతని కళ్ళలో నీళ్ళు.

"నన్ను క్షమించరా తాతయ్యా! ఈ తాత పరువూ, మన కుటుంబం పరువూ నిలబెట్టుకోవడానికి, ఆమధ్య చదువులో నీకు వచ్చిన 'బంగారు పతకం' నువ్వు త్యాగం చెయ్యక తప్పలేదు. నన్ను మన్నించు."

కళ్ళవెంబడి కన్నీళ్ళు చెంపలపైకి జారుతుండగా, భార్యకు కనిపించకుండా తువాలుతో తుడుచుకుంటూ, అక్కడి నుంచి తన గదిలోకి వచ్చేశాడు వెంకటరాయుడు. ★